## వాహనాల తనిఖీల్లో రూ.2లక్షలు పట్టివేత


నాగల్‌కడ్మూర్ వద్ద నగదును సీజ్ చేస్తున్న పోలీసులు

అమరచింత, అక్టోబర్ 28: మండలంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక కారులో రూ.రెండు లక్షలు పట్టుకున్నట్లు అమరచింత ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు. మండలంలోని నాగల్‌కడ్మూర్ వద్ద ఏర్పాటు చేసిన అవుట్ పోలీసు చెక్‌పోస్టు వద్ద శనివారం మధ్యాహ్నం వాహనాలను తనిఖీ చేస్తుండగా, ఆత్మకూర్ మండలం పిన్నంచెర్లకు చెందిన వెంకటేష్, తన కారులో రూ.రెండు లక్షల నగదును తీసుకెళ్తుండగా సిబ్బంది గుర్తించారని తెలిపారు. ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో సీజ్ చేసి, నారాయణపేట గ్రీవెన్స్‌లో అప్పగించామని తెలిపారు.

## పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి


మాట్లాడుతున్న జీహెచ్‌ఎం తారాబాయి

వనపర్తి టౌన్, అక్టోబర్ 28: తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్‌ఎం తారాబాయి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఫేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించాలని, విద్యార్థుల అభిరుచులు, అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్‌ఎంసీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిరోజూ బడికి పంపాలి

వనపర్తి రూరల్, అక్టోబర్ 28: ప్రతి ఒక్కరూ తమ పిల్లలను నిత్యం పాఠశాలకు పంపాలని ఎంపీడీవో సుదర్శన్ అన్నారు. శనివారం మండలంలోని పెద్దగూడెం హైస్కూల్‌లో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తల్లిదండ్రులు పిల్లల చదువుతో పాటు వారిలో నైపుణ్యత, సృజనాత్మకతను వెలికితీసేలా చూడాలని చెప్పారు. ఆ దిశగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువును మధ్యలో నిలిపివేయరాదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండన్న, స్కూల్ కమిటీ సభ్యులు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ


కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న రాళ్ల కృష్ణయ్య

ఖిల్లాఘణపురం, అక్టోబర్ 28: మండల కేంద్రానికి చెందిన మ్యాదరి కాశన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్లకృష్ణయ్య మృతుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆర్థికసాయం అందజేశారు. ఆయనతో పాటు శంకర్, మన్నెం, చెన్నయ్య, యాదయ్య ఉన్నారు.

# గ్రామాల్లో పర్యవేక్షించిన ఎన్నికల అధికారులు



దొడగుంటపల్లిలో పర్యటిస్తున్న ఎన్నికల అధికారులు


వనపర్తి రూరల్: పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో, సర్పంచ్‌లు

పెద్దమందడి, అక్టోబర్ 28: రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఆయా పార్టీలకు సంబంధించిన నాయకులు ప్రజలను మద్యం, డబ్బుకు ప్రలోభాలకు గురిచేస్తున్నారనే ఉద్దేశంతో ఎన్నికల అధికారులు పర్యవేక్షించారు. శనివారం మండలంలోని ముందరితండా, దొడగుంటపల్లి, పామిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఎన్నికల అధికారులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు వంశీకృష్ణ మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనల మేరకు గ్రామాల్లో పార్టీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు తదితర వాటిని ఏర్పాటు చేయకూడదని, సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలనుకునే వారు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు తదితరులు ఉన్నారు.

### పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి

వనపర్తి రూరల్, అక్టోబర్ 28: అతికొద్ది రోజుల్లో రానున్న ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో సుదర్శన్ అన్నారు. అందులో భాగంగా శనివారం ఆయన మండలంలోని పెద్దగూడెం, కడుకుంట్లలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు వంటివి సమకూర్చాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యం, ర్యాంపులు పలు అంశాలపై దృష్టిసారించాలని పేర్కొన్నారు. ఆయన వెంట పంచాయతీ ఏఈ, ఆర్ఐ, ఎఫ్ఏ, సర్పంచులు కొండన్న, బాలకృష్ణ తదితులు ఉన్నారు.

# ఆదర్శనీయం.. వాల్మీకి జీవితం


పెబ్బేరు: శాఖాపురంలో వాల్మీకి జయంతిలో ప్రమోద్‌రెడ్డి


శ్రీరంగాపురంలో వాల్మీకి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వాల్మీకులు

పెబ్బేరు, అక్టోబర్ 28: భారతీయ సంస్కృతి, ఇతిహాసాలు, మానవ సంబంధాలు, కుటుంబ విలువల సారాంశంగా రామాయణాన్ని రచించి, భావితరాలకు వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయుడయ్యాడని నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎన్నికల సమన్వయకర్త వంగూరు ప్రమోద్ రెడ్డి అన్నారు. శనివారం పెబ్బేరు మండలం వై.శాఖాపురంలో వాల్మీకి జయంతి సందర్భంగా మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీయ చరిత్రలో సంస్కృత భాషలో పద్యాల రచన రామాయణంతోనే మొదలైందని.. ఆ ఘనత వాల్మీకికే దక్కిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలచంద్రారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కోదండరాంరెడ్డి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వనంరాములు, నాయకులు పెద్దింటి వెంకటేష్, కురుమూర్తి, రాజశేఖర్, గోవిందు, మజీద్, సందీప్, పరమేశ్ పాల్గొన్నారు.

శ్రీరంగాపురం, అక్టోబర్ 28: వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని వాల్మీకి విగ్రహానికి మండల వాల్మీకి సోదరులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువ బీఆర్‌ఎస్ నాయకులు నరేశ్‌నాయుడు మాట్లాడుతూ భారతీయ చరిత్రలో సంస్కృత భాషలో పద్యాల రచన రామాయణంతోనే మొదలైందన్నారు. వాల్మీకి మహర్షి బ్రహ్మ దయతో రామాయణాన్ని సృష్టించాడని భారతీయ విశ్వాసం. ఇది భారతదేశపు మొదటి గొప్ప ఇతిహాసమని ఆయన కొనియాడారు. వాల్మీకి సీతారాముల జీవిత చరిత్ర తెలియజేయడంతో పాటు మనిషి జీవన విధానాన్ని మనుషుల మధ్య అనుబంధాలను ఆ గ్రంథం ద్వారా అందరికీ తెలియజేశారన్నారు. అలాంటి వాల్మీకి మహర్షి జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. ప్రతి ఒక్కరూ వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకొని, తమ జీవితంలో చెడు అలవాట్లను వదిలిపెట్టి మంచి పనులు చేస్తూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో మండల వాల్మీకి సంఘం సభ్యులు సంపత్ నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

## విజయవంతమైన శిక్షణ తరగతులు

వనపర్తి టౌన్, అక్టోబర్ 28: వనపర్తి జిల్లా కేంద్రంలో చైల్డ్ రైట్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ తరగతులు విజయవంతమయ్యాయి. బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో శనివారం బాలల న్యాయ చట్టం 2015 మిషన్ వాత్సల్య పథకంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలల రక్షణ, సంరక్షణ అవసరమున్న పిల్లలకు ఏవిధంగా న్యాయం చేయాలి, బాలల న్యాయ సంక్షేమ సమితి, పరిరక్షణ విభాగం, శిశు సంరక్షణ కేంద్రాలు, చైల్డ్ హెల్ప్‌లైన్ కేంద్రాలు చేపట్టవలసిన విధులు, బాధ్యతలు అనుసరించాల్సిన నియమాలపై శిక్షణలో అవగాహన కల్పించారు. బాలల వ్యక్తిగత సంరక్షణ, సామాజిక దర్యాప్తు నివేదిక పద్ధతుల రూపకల్పనపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శిశు సంక్షేమ శాఖ అధికారి రామమహేశ్వర్‌రెడ్డి, అలివేలమ్మ, నళిని, విజయ్, విష్ణు, బాలల సంరక్షణ అధికారి రాంబాబు, బాలసదన్ నిర్వాహకులు ఉన్నారు.

## కేంద్ర బలగాల కవాతు

పెబ్బేరు, అక్టోబర్ 28: శాసనసభ ఎన్నికలను పురస్కరించుకొని శాంతి భద్రతల విషయంలో ప్రజలకు భరోసా కల్పించేందుకు శనివారం పెబ్బేరులో కేంద్ర పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. కొత్తకోట సీఐ శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎస్సై జగదీశ్వర్ ఆధ్వర్యంలో పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయం నుంచి కిష్టారెడ్డిపేట వరకు గల ప్రధాన రహదారిపై 60 మంది సీఆర్‌పీఎఫ్ పోలీసులు కవాతు చేశారు. కార్యక్రమంలో పెబ్బేరు పోలీసులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థులకు సన్మానం

పెద్దమందడి, అక్టోబర్ 28: మండలంలోని బలిజపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు పోలీస్ నియామకాల్లో ప్రతిభ కనబర్చి ఉద్యోగాలు సాధించడం పట్ల శనివారం పాఠశాల హెచ్‌ఎం మంజులత, గ్రామానికి చెందిన అడ్వకేట్ అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు కె.గణేష్, పరమేష్, జె.హరీశ్‌గౌడ్, డి.రాకేష్, ఎం.సచిన్ పోలీస్ ఉద్యోగాలు సాధించడం పాఠశాలకు గర్వకారణమన్నారు. వీరు పాఠశాల విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'కాంగ్రెస్ పార్టీ చిన్నారెడ్డి జాగీరా'

గోపాల్‌పేట, అక్టోబర్ 28: కాంగ్రెస్ పార్టీ చిన్నారెడ్డి జాగీరా, పైరవీలతో టికెట్ తెచ్చుకొని ఎన్నికల్లో పోటీ చేస్తే ప్రజాదరణ లేకుండా ఎలా గెలుస్తాడని కాంగ్రెస్ నాయకులు మంద సత్యశీలారెడ్డి మాజీ మంత్రి జి. చిన్నారెడ్డిపై విరుచుకుపడ్డారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతిసారి ఎన్నికలు రాగానే ఒకసారి అవకాశం ఇవ్వండని కోరుతూ, ప్రజాదరణ లేకున్నా పార్టీ అధిష్ఠానంతో పైరవీ చేసి టికెట్ తెచ్చుకొని ఓడిపోవడం పరిపాటిగా మారిందని విమర్శించారు. ప్రజాదరణ కలిగిన మేఘారెడ్డికి టికెట్ కేటాయించాలని అధిష్ఠానాన్ని ఆయన కోరారు.

## తప్పిన పెను ప్రమాదం

వనపర్తి టౌన్, అక్టోబర్ 28: జిల్లా కేంద్రంలో శనివారం తుఫాను వాహనం చికెన్ షాపులోకి వెళ్లిన ఘటన చోటుచేసుకున్నది. కోడేరు మండలం రాజాపూర్ నుంచి తుఫాను వాహనం వనపర్తి మీదుగా హైదరాబాద్ వెళ్లేందుకు వనపర్తి చేరుకున్నది. వివిధ గ్రామాలవారిని ఎక్కించుకున్న వచ్చారు. గాంధీచౌక్ దాటి మారెమ్మకుంట సమీపానికి చేరుకోగా, ఆటోను తప్పించబోయి పక్కనే ఉన్న చికెన్ షాపులోకి దూసుకెళ్లింది. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. వాహనం ముందుభాగం ధ్వంసమైంది. .